

శుద్ధి జలాల పంపిణీకి చర్యలు: ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - మొగల్తూరు

నియోజకవర్గంలోని ప్రజలందరికీ శుద్ధి జలాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. స్థానికంగా ఉన్న సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఫిల్టర్ బెడ్‌లను, తాగునీటి చెరువును, పంప్‌హౌస్‌లను పరిశీలించారు. నియోజకవర్గంలోని ఆరు సమగ్ర రక్షిత మంచినీటి పథకాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు శుద్ధి జలాలు అందించనున్నామన్నారు. ప్రధాన కాలువలో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్క తొలగించేందుకు టెండర్లు పిలిచామన్నారు. రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ, మున్సిపల్, వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయం చేసుకుని ముందుకు సాగుతున్నామన్నారు. వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు నాయకర్‌కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. తొలుత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి బోనం నరసింహారావు, మునీశ్వరరావు, జనసేన నేతలు పాల్గొన్నారు.

ధరలు దిగొచ్చేదెప్పుడో..!



- మండుతున్న నిత్యావసరాల ధరలు
- అదే బాటలో కాయగూరలు
- సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు విలవిల
- ధరల నియంత్రణకు సహకరించాలని వర్తకులను కోరుతున్న అధికారులు
- ధరలు నియంత్రించేది ఇలాగేనా అంటూ ప్రజల్లో విస్తృత చర్చ

ప్రజాశక్తి - భీమవరం

బహిరంగ మార్కెట్లో నిత్యావసరాలతోపాటు కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. సామాన్య, మధ్యతరగతి కుటుంబాల్లో ఆదాయానికి, పెరిగిన ధరలకు పొంతన లేకపోవడంతో లబోదిబోమంటున్నారు. ఈ నేపథ్యంలో ధరల నియంత్రణకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ధరల నియంత్రణకు సహకరించాలని వర్తకులను కోరింది. రైతుబజార్లు, రిలయన్స్, డీమార్ట్ వంటి సూపర్ మార్కెట్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేసింది. ఈ నెల 12వ తేదీలోపు అన్ని రకాల పప్పుల నిల్వలు వెబ్ పోర్టులో నమోదు చేయాలని ఆదేశించింది. అయితే ఈ చర్యలతో ధరల నియంత్రణ సాగుతుందా అనే అనుమానాలు జనాల్లో నెలకొన్నాయి.


ప్రభుత్వ విధానాలు, ప్రకృతి వైపరీత్యాలతో నిత్యావసరాల ధరలు కొండెక్కాయి. మార్కెట్లో ఏం కొనాలన్నా వందల్లోనే చెల్లించాల్సిన దుస్థితి నెలకొందని అంతా గగ్గోలు పెడుతున్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ధరలను నియంత్రిస్తామని చెప్పినా ఆచరణలో లేకపోవడంతో పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని వర్తకులే చెబుతున్నారు. ప్రస్తుతం కందిపప్పు కిలో రూ.180, మినపగుళ్లు కిలో రూ.140, టీ పొడి కిలో రూ.400 నుంచి రూ.500, పల్లీలు కిలో రూ.140, వెల్లుల్లి కిలో రూ.300, చింతపండు కిలో రూ.140, ఆయిల్ కిలో రూ.120 నుంచి రూ.180 వరకూ పలుకుతోంది. ఇక నెల రోజులుగా కూరగాయల ధరలు కూడా వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. వారం రోజుల క్రితం కిలో టమాటా రూ.80పైనే విక్రయించగా ప్రస్తుతం రూ.50 నుంచి రూ.60 వరకు పలుకుతోంది. మిర్చి రూ.50, దొండకాయలు రూ.30, బెండకాయలు రూ.40, కేరెట్ రూ.50, దోస రూ.30, బీట్‌రూట్ రూ.60, బీరకాయలు రూ.80, వంకాయలు రూ.50, బంగాళాదుంపలు రూ.50, చిక్కుళ్లు రూ.80, బీన్స్ రూ.100, కాకర రూ.80 పలుకుతున్నాయి. కొన్నిరోజుల క్రితం ఉల్లిపాయ ధరలు ఒక్కసారిగా పెరిగాయి. కిలో ఉల్లి రూ.65 వరకు విక్రయించారు. ఇతర రాష్ట్రాల నుంచి ఉల్లి రావడంతో ధర దిగొస్తుంది. ప్రస్తుతం నాణ్యతను బట్టి కిలో ఉల్లిని రూ.40 వరకు విక్రయిస్తున్నారు. తాడేపల్లిగూడెంలో ఉల్లి మార్కెట్లో దిగుమతులు పెరగడంతో ఉల్లి వ్యాపారులు ప్రస్తుతం మూడు కిలోలు రూ.వందకు విక్రయిస్తున్నారు. ధరల నియంత్రణపై సరైన వ్యవస్థ లేకపోవడంతో ఎప్పుడు పెరుగుతాయో.. ఎప్పుడు తగ్గుముఖం పడతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది వేసవిలో విపరీతమైన ఎండలు, వేడి గాలులు కారణంగా కొన్నిచోట్ల కూరగాయ తోటలు మొక్కదశలోనే ఎండిపోవడం, కాయదశలో రాలిపోవడం వంటివి జరిగినట్లు రైతులు చెబుతున్నారు. దీంతో ధరలు పెరిగాయి.

ధరల నియంత్రణ ఇలాగేనా

బహిరంగ మార్కెట్లో నిత్యావసరాల, కూరగాయల ధరల నియంత్రణకు జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య సంబంధిత అధికారులు, రిటైల్ అమ్మకదారులతో సమావేశమయ్యారు. నిత్యావసరాల ధరల స్థిరీకరణపై సమీక్షించారు. జిల్లాలోని అన్ని రైతుబజార్లు, డీమార్టు, రిలయన్స్, సూపరు మార్కెట్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, రేట్లు వివరాలను అందరికీ కన్పించేలా బోర్డులు డిస్‌ప్లే చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. బియ్యం, కందిపప్పును మార్కెట్ ధర కంటే తక్కువకు విక్రయించాలని ఆదేశించారు. స్టీమ్ రకం బియ్యం కిలో రూ.49, ముడి రకం బియ్యం కిలో రూ.48, కందిపప్పు (దేశవాళి) కిలో రూ.160గా నిర్ణయించారు. రైస్, పప్పులు, ఆయిల్, కూరగాయలు, రిటైల్ వ్యాపారస్తులకు ఉల్లి, టమాటా ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను జెసి ఆదేశించారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో దళారీ వ్యవస్థ రాజ్యమేలుతున్న తరుణంలో ధరల నియంత్రణ ఇలాగేనా అనే చర్చ సాగుతోంది. జెసి ఆదేశాలను వర్తకులు పాటిస్తారా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడంతోపాటు తరచూ తనిఖీలు, దాడులు చేయడం ద్వారానే ధరలు ఎంతోకొంత అదుపులో ఉండే అవకాశం ఉందని జనం అభిప్రాయపడుతున్నారు.

ధరల నియంత్రణకు వర్తకులు సహకరించాలి

సివి.ప్రవీణ్‌ఆదిత్య, జాయింట్ కలెక్టర్



బహిరంగ మార్కెట్లో నిత్యావసరాల ధరల నియంత్రణకు వర్తకులు సహకరించేందుకు ముందుకు రావాలి. సరసమైన ధరలకు నాణ్యమైన వస్తువులు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. వర్షాకాలం నేపథ్యంలో ప్రకృతి విపత్తులను దృష్టిలో ఉంచుకుని నిత్యావసరాల ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి. కొంతమంది వ్యాపారస్తులు నిత్యావసరాలను ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించి అమ్మకాలు చేస్తున్నారు. ఇది సరికాదు. ప్రజలకు మంచి చేయాలనే దృక్పథం అమ్మకందారుల్లో ఉండాలి.

జిల్లాస్థాయి సేవలందించాలి

ఏరియా ఆస్పత్రి తనిఖీల్లో కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం



వైద్యాధికారులతో జిల్లా కలెక్టర్ నాగరాణి

భీమవరం ఏరియా ఆసుపత్రిలో జిల్లాస్థాయి ఆసుపత్రి సేవలందించడానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి ఆదేశించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రసూతి వార్డు, మందుల నిల్వ కేంద్రం, పరిపాలన, ఓపి విభాగాలు, ల్యాబ్, స్కానింగ్, ఎక్సరే యూనిట్లను పరిశీలించారు. సంబంధిత వైద్యులకు పలు సూచనలు చేశారు. ప్రసూతి వార్డులో నవజాత శిశువులను, తల్లులకు అందుతున్న వైద్య సహాయంపై ఆరా తీశారు. నవజాత శిశువు గుండె పనితీరును పరిశీలించే సిటిజి మిషన్స్ ఎన్ని ఉన్నాయి, వినియోగంలో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నవజాత శిశువుల ఓర్మర్, ఫొటోథెరఫీ యూనిట్లను పరిశీలించారు. వార్డులో చికిత్స పొందుతున్న 18 ఏళ్ల యువతితో ఏ విషయమై చికిత్స పొందుతున్నారని కలెక్టర్ ఆరా తీశారు. వ్యక్తిగత కారణాలతో పాయిజన్ తీసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని డిసిహెచ్‌ఎస్ వివరించారు. దీనిపై ఆ యువతిని కలెక్టర్ సున్నితంగా మందలించారు. ప్రతి సమస్యకూ చావు పరిష్కారం కాదని, సమస్య పరిష్కారానికి ఆలోచనతో ముందు సాగాలని హితవు పలికారు. మందుల విభాగాన్ని పరిశీలించిన సందర్భంలో కాల పరిమితి ముగిసిన మందులను సంబంధిత రిజిస్టర్లో నమోదు చేసి, ఆ మందులను విడిగా భద్రపరచాలని అన్నారు. షుషాన్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న ఎల్‌సియు యూనిట్ ఎంతవరకు వచ్చిందని ఆరా తీశారు. ఈ యూనిట్ వల్ల తల్లి చనుబాలను బిడ్డకు సరిగ్గా అందించలేని సమయంలో తల్లిపాలను యూనిట్ ద్వారా సేకరించి బిడ్డకు అందించడానికి వీలవుతుందన్నారు. ప్రస్తుతం భీమవరం ఏరియా ఆసుపత్రి 50 పడకలస్థాయిలో కొనసాగుతుందని, నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వస్తే వైద్య సేవలను మరింత విస్తరించడానికి అవకాశం ఉంటుందని డిసిహెచ్‌ఎస్ పి.సూర్యనారాయణ కలెక్టర్‌కు వివరించారు. ఆస్పత్రి పరిశీలన అనంతరం కలెక్టర్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి కల్యాణికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఒ డాక్టర్ ప్రవీణ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరందించాలని ధర్నా

ప్రజాశక్తి - నరసాపురం



ధర్నా చేస్తున్న మహిళలు

పట్టణంలోని 25వ వార్డు ఆదర్శనగర్ కాలనీలో మూడు రోజులుగా కుళాయిల ద్వారా వస్తున్న కలుషిత నీటిని అరికట్టి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కోరుతూ బుధవారం కాలనీవాసులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ కుళాయిల ద్వారా నీరు అధ్వానంగా వస్తుందన్నారు. నీళ్లు దుర్వాసన వస్తున్నాయని వాపోయారు. ఈ నీరు తాగితే అతిసార ప్రబలే ప్రమాదముందని హెచ్చరించారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే పైపులైన్ల మరమ్మతులు చేపట్టి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో పాలా జ్యోతి, కె.ఏలేయారాణి, కొల్లాటి శ్యామల, ఎం.పద్మ, కడలి బేబీ, సిహెచ్.సరోజిని, దేవి పాల్గొన్నారు.

అసాధారణ వ్యక్తి రామారావు

స్మారక స్తూపం ఆవిష్కరణలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - పోడూరు, ఆచంట

అసాధారణ వ్యక్తి ఈది రామారావు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. బుధవారం పోడూరు పంచాయతీ పరిధిలోని మార్కెట్ వద్ద కీర్తిశేషులు ఈది రామారావు (స్టీవెన్) స్మారక స్తూపాన్ని ఆయన ఆవిష్కరించారు. స్తూపంపై జెండాను సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఎగురవేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ అధ్యక్షత వహించగా సీతారాం మాట్లాడుతూ ఈది రామారావు పుట్టి 104 సంవత్సరాలు గడిచిపోయాయన్నారు. కమ్యూనిస్టులు మతానికి వ్యతిరేకం కాదన్నారు. రామారావు బర్మా దేశం వెళ్లి వచ్చి పోడూరులో దళితుల గురించి బలమైన ఉద్యమం నిర్వహించారని కొనియాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ రామారావు బర్మా దేశం నుంచి మన దేశం వచ్చిన తర్వాత ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో పని చేశారన్నారు. సిపిఎం ఏర్పడిన తర్వాత నరసాపురం తాలూకా కన్వీనర్‌గా, జిల్లా కమిటీ సభ్యులుగా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులుగా సుదీర్ఘకాలం పాటు పని చేసి అందరి



రామారావు స్మారక స్తూపాన్ని ఆవిష్కరించిన మంతెన సీతారాం

మన్నలు పొందారని గుర్తు చేశారు. ఈది రామారావుతోపాటు సిపిఎం సీనియర్ నాయకులు దూడబోయిన శ్రీరాములు తన యావత్తు జీవితాన్ని ప్రజాఉద్యమానికి అంకితం చేసి నిస్వార్థ ప్రజా సేవకుడిగా వ్యవసాయ కార్మికులు, దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఆచంట మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ రామారావు వృద్యాప్యాన్ని లెక్క చేయకుండా తుది శ్వాస విడిచే వరకు ప్రజా ఉద్యమంలో పనిచేశారన్నారు. 1983లో ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థిగా సిపిఎం తరపున పోటీ చేసి గణనీయమైన ఓట్లు సాధించారన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పండితవిల్లూరు గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకుడు, శతాధిక వద్ధుడు, గీత కార్మికుడు కడలి వెంకన్నను ఘనంగా సత్కరించి సుందరయ్య రచనా సంకలన పుస్తకాన్ని ఆయనకు అందజేశారు. అనంతరం రామారావు కుటుంబ సభ్యులకు సుందరయ్య రచన సంకలన పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, గ్రామ సర్పంచి శెట్టిబత్తుల సువర్ణరాజు, నేతలు మూడే మోజేష్, బొంతు శ్రీనివాస్, బొరాబత్తుల వెంకట్రావు, సూర్నీడి వెంకటేశ్వరరావు, బండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఉండి ఎంఎల్ఎ

భీమవరం: ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ సి.నాగరాణిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఉండి నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్‌తో చర్చించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్యను కలిశారు. వీరితోపాటు డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు ఉన్నారు.

0.5 మిల్లీమీటర్లు సగటు వర్షపాతం నమోదు

నరసాపురం : జిల్లాలో బుధవారం ఉదయం 8 గంటల వరకూ గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. నరసాపురంలో 1.6, గణపవరం, పాలకొల్లు, పెనుగొండ 1.4, యలమంచిలి 1.2, ఇరగవరం 1.2, తణుకు 0.8, పెంటపాడులో 0.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలోని 9.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైందని, సగటు వర్షపాతం 0.5 మిల్లీమీటర్లు నమోదైందని అధికారులు తెలిపారు.

లేబర్ కోడ్లు రద్దుచేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కోర్కెల దినోత్సవం సందర్భంగా సిఐటియు ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన లేబర్ కోడ్లు రద్దుచేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు డి.కళ్యాణి, బి.వాసుదేవరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. దేశవ్యాప్త కార్మికుల కోర్కెల దినం సందర్భంగా స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అక్కడ నిరసన తెలిపి డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కళ్యాణి, వాసుదేవరావు మాట్లాడుతూ కాంట్రాకు ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పనిచేస్తున్న వారందరికీ కనీస వేతనాలు అమలు చేసి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్కీముల్లో పనిచేస్తున్న కార్మికులు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చిరు ఉద్యోగులపై రాజకీయ వేధింపులు పెరిగాయని అధికారులు వెంటనే కలుగజేసుకొని రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అనేక పోరాటాల వల్ల సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేసి కార్మికులకు తీవ్ర నష్టం కలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సిరీస్ కుమార్, సిహెచ్.మహాలక్ష్మి, కలిపిన సత్యనారాయణ, కె.సోమేశ్వరరావు, కె.అప్పన్న, పిన్నింటి శ్రీను, ఎం.వైకుంఠం పాల్గొన్నారు.

వీరవాసరం : ప్రభుత్వాలు మారినా శ్రామిక ప్రజల సమస్యల ఎజెండా పైకి రాకపోవడంతో జాతీయ కోర్కెల దినోత్సవం సందర్భంగా మరిన్ని పోరాటాలు తప్పవని కార్మిక వర్గం హెచ్చరించింది. బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద మండలంలోని అంగన్వాడీ, ఆశ, మిడ్డేమీల్, పంచాయతీ కార్మికులు, విఎఎలు, రైస్‌మిల్ కార్మికులు, స్కూల్ స్వీపర్లు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బల్ల చిన వీరభద్రం, రైతు సంఘం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు డి.వరలక్ష్మి, పి.నాగరత్నం, రైస్ మిల్లు యూనియన్ నాయకులు కె.సత్తిబాబు, మిడ్ డే మీల్ సంఘం నాయకులు మద్దాల శ్రీనివాసు రత్నకుమారి, పంచాయతీ కార్మిక సంఘం నాయకులు మల్లుల ఏసుబాబు, విఎఎల సంఘం నాయకులు పాల్గొన్నారు.

పెంటపాడు : స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడ నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, పెంటపాడు మండల అధ్యక్ష కార్యదర్శులు దూలం.ప్రసాద్, జైశ్యామల కుమారి, సిఐటియు మండల నాయకులు చిర్ల పుల్లారెడ్డి మాట్లాడారు. అసంఘటిత కార్మికులకు నెలకు రూ.26 వేల కనీసం వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బంకురు నాగేశ్వరరావు, పెనగంటి దుర్గ, ఆర్.అనురాధ, జయంతి సీత, జయలక్ష్మి, కనకమాలక్ష్మి, ఆకుల రాజు, రుద్ర వేణు పాల్గొన్నారు.

తణుకు : కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ హెచ్చరించారు. బుధవారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో సిఐటియు ఆల్ ఇండియా పిలుపులో భాగంగా కార్మికులు ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు ఎస్.ఆదినారాయణ బాబు, గుబ్బల గోపి, గార



తాడేపల్లిగూడెంలో ర్యాలీ

రంగారావు, పిఎల్ నర్సింహారావు, పి.దక్షిణామూర్తి, రమేష్, రామకృష్ణ, హర్షవర్ధన్, లక్ష్మీనారాయణ, గోవిందరాజు, పాపారావు, భారతి, ధనలక్ష్మి, జ్యోతి, వసంత పాల్గొన్నారు.

తణుకు : కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు కామన మునిస్వామి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఇరగవరం మండలం తహశీల్దార్ కార్యాలయం వద్ద డిమాండ్స్ డే సందర్భంగా సిఐటియు పిలుపులో భాగంగా అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మునిస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు పి.శ్యామల, సత్యదేవి, పి.అంజనాదేవి, కె.రత్నకుమారి, పి.భూలక్ష్మి, టి.రోజా పాల్గొన్నారు.

ఉండి : కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడి, వారి హక్కులను కాపాడాలని సిఐటియు జిల్లా నాయకులు ధనికొండ శ్రీనివాస్ అన్నారు. డిమాండ్స్ డేలో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో పలు ప్రజాసంఘాల నాయకులు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ కొమ్మూరి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నిమ్మితి కిషోర్, వీరవల్లి శ్రీనివాస్, కడలి నాగేశ్వరరావు, మజ్జి నాగేశ్వరరావు, వంజరపు సూర్యనారాయణ, కట్టా రవి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం డిమాండ్స్ డే నిర్వహించారు కార్మిక వ్యతిరేక విధానాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు ఆధ్వర్యంలో స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, సత్తి కోదండ రామిరెడ్డి, చల్లా చంద్రరావు, జి.నాగేశ్వరరావు, గొర్రెల సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

మొగల్తూరు : స్కీం వర్కర్ల సమస్యల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో స్కీం వర్కర్లు స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం రెవెన్యూ కార్యాలయ సూపరింటెండెంట్ కె.సూర్యనారాయణ రాజుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన



భీమవరం : అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నేతలు

సానుకూలంగా స్పందించి సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు. కార్యక్రమాల్లో జి.పెద్దింట్లు, ఎస్.సారమ్మ, ఎ.సీత, పి.బేబీకుమారి, పి.రేవతి, బి.ఝాన్సీ, ఆర్.విజయ పాల్గొన్నారు.

గణపవరం: సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని స్కీమ్ వర్కర్లు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పచ్చిపులుసు గోవిందు, అంగన్వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కార్యదర్శులు కె.ఝాన్సీ, ఎమ్‌డి హసీనా బేగం మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ వై.రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. వివిధ సంఘాల నాయకులు బి.జయలక్ష్మి, స్రవంతి, టి.వరలక్ష్మి, లక్ష్మి, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆచంట : దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతూ, కార్మిక హక్కులను కాలరాస్తోన్న మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని సిఐటియు మండల అధ్యక్షురాలు వైట్ల ఉషారాణి, ఆశా వర్కర్ల సంఘం మండల కార్యదర్శి నక్కా శైలజ కార్మికులకు పిలుపునిచ్చారు. డిమాండ్స్ డే సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి కేతా నాగాంజనేయులు అధ్యక్షత వహించారు. వారు మాట్లాడారు. అలాగే డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ ఐపి శెట్టికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ మండల నాయకురాలు మైలే విజయలక్ష్మి, గుత్తుల శ్రీదేవి, వెంకటరమణ, నాగమణి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పాలకోడేరు : ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపిని ఐక్యంగా తిప్పికొట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ పిలుపునిచ్చారు. కోర్కెల దినోత్సవం సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షురాలు ఎస్.లారెన్స్‌కుమారి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి శేషాపు ఆశ్రయ, కృష్ణంరాజు, విమల, వరలక్ష్మి, జాస్మిన్ పాల్గొన్నారు.

ఆకివీడు : కేంద్రంలో బిజెపి ప్రభుతం లేబర్ కోడ్ చట్టాన్ని అమలు చేయడానికి మరింత దూకుడుగా వ్యవహరిస్తోందని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు, ఆశాలు కొద్దిసేపు నిరసన తెలిపి డిప్యూటీ తహశీల్దార్ ఫరూక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం గోపాలన్ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు పెంకి.అప్పారావు, కె.తవిటినాయుడు, కేశిరెడ్డి ధనరాజు, పైలా శీను, అంగన్వాడీలు పాల్గొన్నారు.

యలమంచిలి : డిమాండ్స్ డే సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి దేవా సుధాకర్, కెవిపిఎస్ జిల్లా నాయకులు కానేటి బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి మాట్లాడారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు శ్రీవర్ధిని, రజని పాల్గొన్నారు.

పెనుమంట్ర : కోర్కెల దినోత్సవం సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బ్రాహ్మణ చెరువు సెంటర్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి, అక్కడ ధర్నా చేశారు. అనంతరం తహశీల్దార్ లక్ష్మీకళ్యాణికి వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, సివిల్ సప్లై కార్మికులు, రైస్ మిల్లు కార్మికులు, సిఐటియు మండల కార్యదర్శి కోడి శ్రీనివాస్ ప్రసాద్, చిత్రంజన్ పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : కోర్కెలు దినం సందర్భంగా తహశీల్దార్ మధుసూదన్‌రావుకు వినతిపత్రాన్ని సిఐటియు నాయకులు జవ్వాది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చింతపల్లి లక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నేత దేవి బీబీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నరసాపురం : కేంద్ర మోడీ ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బస్‌స్టాండ్ సెంటర్ నుండి గాంధీ బొమ్మ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లో నిరసన తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ, సిఐటియు పట్టణ అధ్యక్షులు ముచ్చర్ల త్రిమూర్తులు, పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, జల్లి రామ్మోహన్ రావు, బొక్కా శ్రీనివాస్, గుబ్బల నాగేశ్వరరావు, నోముల కొండ పాల్గొన్నారు.

పెనుగొండ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయకుండా హెచ్చరించడానికే డిమాండ్స్ డే నిర్వహిస్తున్నట్లు సిఐటియు మండల అధ్యక్షుడు నాగిశెట్టి గంగారావు అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద స్కీం వర్కర్లు, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ వర్కర్లు, ధర్నా నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. గంగారం మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు షేక్ పాదుషా, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు తులసి, ఐకెపి వర్కర్స్ నాయకురాలు లక్ష్మి పాల్గొన్నారు.

కాళ్ల : సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద డిమాండ్స్ డే సందర్భంగా నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ ఎస్.శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి మండా సూరిబాబు, సిఐటియు నాయకులు వేగేశ్న పద్మ, రెడ్డి దేవి, ఝాన్సీ, స్కీం వర్కర్స్ పాల్గొన్నారు.

పాలకొల్లు : కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, పాలకొల్లు ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీదేవి, బి.నాగలక్ష్మి, రుతు పాల్గొన్నారు.


సర్పంచి ఆర్థిక సహకారంతో చేపడుతున్న రోడ్డు మరమ్మతు పనులు

గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనులు


సర్పంచి ఆర్థిక సహకారంతో రోడ్డు మరమ్మతులు

ప్రజాశక్తి - కాళ్ల

దొడ్డనపూడి గ్రామ అభివృద్ధే తన లక్ష్యంగా సర్పంచి కొల్లి సుబ్బారావు ముందుకు సాగుతున్నారు. గ్రామంలో మెయిన్ రోడ్డు పలుచోట్ల గోతులమయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు ఛిద్రమైంది. దీంతో ప్రజలు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రోడ్డు మరమ్మతులు చేపడుతున్నారు. వర్షాకాలం దృష్ట్యా వర్షపు నీరు నిల్వ ఉండకుండా వెళ్లే ఏర్పాట్లు చేయడంతో పాటు, రోడ్డు మరమ్మతులు చేపట్టారు. రోడ్డుపై ఉన్న గుంతలు పూడ్చి ప్రజలు రాకపోకలు సాగించేలా బాగు చేయించారు. తమ కష్టాలను గుర్తించి దగ్గరుండి రోడ్డు బాగు చేయించిన సర్పంచి కొల్లి సుబ్బారావుకు దొడ్డనపూడి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - కాళ్ల


విద్యార్థులకు కిట్లు పంపిణీ

జన్మభూమిపై మమకారంతో చదువుకున్న పాఠశాలకు సాయం చేయాలనే ఉద్దేశంతో కంతేటి శ్రీనివాసరాజు ఆరు సంవత్సరాల నుంచి విద్యార్థులకు సామగ్రి అందించడం అభినందనీయమని ప్రాతళ్లమెరక మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూనపురాజు రామ్మూర్తిరాజు అన్నారు. ప్రాతళ్లమెరక మెయిన్ ప్రాథమిక పాఠశాలలో టిడిపి గ్రామ అధ్యక్షుడు కంతేటి శ్రీనివాసరాజు, కలిదిండి రామచంద్రరాజు ఆర్థిక సహకారంతో విద్యార్థులకు రూ.15 వేల విలువైన విద్యా సామగ్రి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా దాత కంతేటి శ్రీనివాసరాజు మాట్లాడుతూ కాన్వెంట్ విద్యకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో గుణాత్మక విద్యనందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని కళ్యాణి, దాత కలిదిండి రామచంద్రరాజు, కంతేటి సుబ్బరాజు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాలకొల్లు: టిడిపి కూటమి ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజా రమణి కోరారు. స్థానిక ఎంఎంకెఎన్ మున్సిపల్ హైస్కూల్, బివిఆర్ఎం బాలికల హైస్కూల్లో విద్యార్థులకు కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు జివి.మహమ్మద్ జానీ, ఫకీరు బాబు, నిర్మలాకుమారి, జనసేన నేతలు పాల్గొన్నారు.

గోదావరిలో తేలిన చేప పిల్లలు

ప్రజాశక్తి - నరసాపురం

గోదావరిలో పొన్నపల్లి సమీపంలో పెద్దఎత్తున చేప పిల్లలు బుధవారం మృతి చెంది తేలడం కలకలం రేపింది. స్థానిక మత్స్యకారులు తెలిపిన వివరాల ప్రకారం గతేడాది నుండి గోదావరిలో మత్స్య సంపద లేకుండా ఇబ్బందులు పడుతున్నామని, నరసాపురం-పాలకొల్లు రోడ్డులో ఒక ఆక్వా ఫ్యాక్టరీ నుండి నేరుగా గోదావరిలోకి కలుషిత నీరు వదలడం వల్ల మత్స్య సంపద దెబ్బతింటోందని తెలిపారు. దీనిపై ఇప్పటికైనా సంబంధించిన అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్ఐగా సూర్యనారాయణకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - ఉండి

ఉండి పోలీస్‌స్టేషన్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న ఆకురాతి సూర్యనారాయణకు ఎస్ఐగా ఉద్యోగోన్నతి లభించింది. 1987 బ్యాచ్‌కు చెందిన ఆకురాతి సూర్యనారాయణ గతంలో నరసాపురం, ఏలూరు, తణుకు, యలమంచిలి, ఆకివీడు, భీమవరం రూరల్, ఉండి పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వర్తించారు. ఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందిన ఆకురాతి సూర్యనారాయణను ఆకివీడు సిఐ కెవివిఎస్ సత్యనారాయణ, ఎస్ఐ మందపల్లి లక్ష్మణ్, స్టేషన్ సిబ్బంది అభినందించారు. ఉండిలో పనిచేసిన అనతికాలంలోనే సూర్యనారాయణ ప్రజల మన్ననలను పొందడంతో పలువురు సూర్యనారాయణకు శుభాకాంక్షలు తెలియజేశారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా బుధవారం పిహెచ్‌సిలో 76 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ సంతోష్, డాక్టర్ కిరణ్మయి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక నాలుగు సచివాలయాల్లో నుండి వచ్చిన మొదటి రెండో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు చెప్పారు. గర్భిణులు తప్పనిసరిగా నాలుగుసార్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. పోషకాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ జె.విల్సన్‌బాబు, హెచ్‌విసిహెచ్ పద్మజ, ఎఎన్ఎంలు ఎంఎల్‌హెచ్‌పి ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవిత బీమా ప్రీమియంపై జిఎస్‌టి తొలగించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జీవిత బీమా సంస్థ పాలసీలకు పట్టాదారులు చెల్లించే ప్రీమియంపై జిఎస్‌టిని పూర్తిగా తొలగించి సంస్థను ప్రోత్సహించాలని జీవిత బీమా సంస్థ పెన్షనర్ల సంఘం నాయకులు గరికపాటి బాపయ్య శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి ఒక లేఖను రాసినట్లుగా తెలిపారు. సుమారు 30 కోట్ల జీవిత బీమా పట్టాదారులకు 18 శాతం జిఎస్‌టి చెల్లించడం భారంగా పరిణమించిందని తెలిపారు. జీవిత బీమా సంస్థకు అవరోధంగా ఉన్న జిఎస్‌టిని రాబోయే కేంద్ర బడ్జెట్లో పూర్తిగా తొలగించాలని కోరారు. బీమా ఉద్యోగులు, గడిచిన లోక్‌సభ ఆర్థిక వ్యవహారాల కమిటీ కూడా జిఎస్‌టి తొలగింపుపై సిఫార్సు చేసినట్లు తెలిపారు.

డ్రోన్‌తో గడ్డి మందు పిచికారీ

ప్రజాశక్తి - కాళ్ల

సీసలి వద్ద మొగదిండి మురుగు కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు, కిక్కిస తొలగించేందుకు డ్రోన్ సహాయంతో గడ్డి మందు పిచికారీ చేశారు. గుర్రపు డెక్కతో పూడుకుపోయిన కాలువలో డ్రోన్ సాయంతో కలుపుమందు పిచికారీ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గత వైసిపి ప్రభుత్వంలో అవినీతితో పాటు నియోజకవర్గంలో ప్రధానంగా డ్రెయిన్‌లో గుర్రపుడెక్క, జమ్ము చెత్తాచెదారం పేరుకుపోయాయన్నారు. గత ప్రభుత్వంలో పట్టించుకునే నాధుడే లేక రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారని, కూటమి ప్రభుత్వంలో రైతే రాజు అనే నినాదంతో ఉండి నియోజకవర్గంలో ఉన్న ప్రతి ప్రధాన డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్తను ప్రభుత్వనిధులు, దాతలు డ్రెయినేజీ మైంటెనెన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ఉండి సహకారంతో పనులు ప్రారంభించామన్నారు. ఆయన వెంట జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మండలం సారవ గ్రామంలో బుధవారం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పలు అభివృద్ధి కార్యక్రమాలను జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి చిన్నాతో కలిసి ప్రారంభించారు జడ్‌పి హైస్కూల్‌లో నూతనంగా నిర్మించిన తరగతి గదులు, సారవ-పెదలంక రోడ్డు, సారవ సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆకన చంద్రశేఖర్, కోటిపల్లి వెంకటేశ్వరరావు, కైలా సతీష్‌లావణ్య, నిప్పులేటి తారకరామారావు, ఒడుగు ఏసుబాబు పాల్గొన్నారు.

ఆగర్తిపాలెంలో డ్రెయిన్‌లో తూడు నిర్మూలనా పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని ఆగర్తిపాలెం గ్రామంలో బుధవారం మొగల్తూరు మురుగు డ్రెయిన్‌లో గుర్రపుడెక్క, తూడు నిర్మూలన పనులు మొదలయ్యాయి. మురుగు డ్రెయిన్‌లో డ్రోన్ ద్వారా రసాయనం చల్లారు. రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు మురుగు డ్రెయినేజీ శాఖ పర్యవేక్షణలో పనులు చేపట్టారు. జున్నూరు నుంచి మొగల్తూరు మండలం పల్లిపాలెం వరకూ 25 కిలోమీటర్లు పొడవునా ప్రవహించే మొగల్తూరు మురుగు డ్రెయిన్‌లో దట్టంగా గుర్రపుడెక్క, తూడు పెరిగిపోయాయి. దీనివల్ల మురుగునీటి పారుదల జరక్క రైతులు కష్టనష్టాలు అనుభవిస్తున్నారు. జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో నిర్లక్ష్యం చేయడంతో వర్షాకాలంలో చిన్నపాటి చినుకుకే పంట చేలు ముంపునకు గురై రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వంలో జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు రైతులకు మేలు జరిగేలా పనులు చేపట్టేందుకు తొలి ప్రాధాన్యతిచ్చారు. పంట కాలువలు, మురుగు డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క, సిల్టు తొలగింపు పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సంబంధిత శాఖ ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలిచ్చారు. అందులో భాగంగా ఆయా కాలువలపై చేపట్టాల్సిన పనులకు టెండర్లు పిలిచి పనులు మొదలెట్టేలా అధికార యంత్రాంగం దృష్టి సారించింది. మొగల్తూరు డ్రెయిన్‌తో పాటు భగేశ్వరం డ్రెయిన్, మరో 23 మైనర్ డ్రెయిన్లు కలిపి రూ.10.50 లక్షలు మంజూరైంది. ఈ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎఎంసి మాజీ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు మాట్లాడుతూ రైతులకు మేలు జరిగేలా అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వంలో కాలువల్లో గుర్రపు డెక్క, తూడు వంటి తొలగింపు పనులు చేపడుతున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి రామానాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు క్లస్టర్ ఇన్‌ఛార్జి కోడి విజయభాస్కర్, అందేకోటి వీరభద్రం, నిమ్మల సారధి, ఉంగరాల నరసింహారావు, నున్న బోయిన సత్యనారాయణ, అంగర వీరభద్రకుమార్, మేడిది డేవిడ్ జాన్‌రాజు, ఇంటి శ్రీరాముడు, కామశెట్టి అయ్యప్ప నాయుడు పాల్గొన్నారు.


పనులు ప్రారంభిస్తున్న నేతలు, అధికారులు

పల్లెల్లో విస్తృతంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు : డిపిఒ

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన విస్తృత పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని గ్రామ కార్యదర్శులను జిల్లా పంచాయతీ అధికారి (డిపిఒ) ఆర్.విక్టర్ ఆదేశించారు. జక్కరంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమీక్షించారు. పారిశుధ్యం, డ్రింకింగ్ వాటర్, డ్రెయినేజీ పలు సమస్యలపై చర్చించి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డిపిఒ విక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో డయేరియా, డెంగీ జ్వరాలు గ్రామాల్లో ప్రబలుతున్నాయని అపరిశుభ్రత, నీటి కలుషితం కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వీధుల్లో డ్రెయినేజీల్లో చెత్త వేయకుండా నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే చెత్తా చెదారాలు వేసేలా విస్తృత అవగాహన కల్పించాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ మిషన్లు వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తడి, పొడి చెత్త వేసే విధంగా గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిపిఒ వెంట ఇఒపిఆర్‌డి ఎంవి.భాస్కరరావు, పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, సతీష్‌కుమార్, అరుణాదేవి, బాలకృష్ణ పాల్గొన్నారు. అనంతరం జక్కరంలో రక్షిత నీటి పథకాన్ని, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు.

దళితులకు శ్మశాన వాటికలు కేటాయించాలి

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పుష్పరాజ్

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రంలో దళితులకు శ్మశానవాటికలు కేటాయించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్ నాగరాణిని కలిసి దళితుల సమస్యలను విన్నవించి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ ఆచంట నియోజకవర్గం ఆలమూరు గ్రామంలో ఏర్పడిన శ్మశానవాటిక సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఉండి నియోజవర్గం వాండ్రంలంకలో దళితుల శ్మశానవాటికను ఆక్రమించి 77 సెంట్లు అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నప్పటికీ పూడిక చేయలేదన్నారు. ఎన్ఆర్‌పి అగ్రహారంలో శ్మశానవాటికలో సరైన సదుపాయాలు లేవని, వెంప గ్రామంలో శ్మశానవాటికలో నుంచి చెరువులకు రోడ్లు వేసుకున్నారని, వీటిపై దృష్టి సారించి దళితులకు మేలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ నాగరాణి దళితుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన వారిలో జిల్లా అధ్యక్షులు నేతల సువర్ణరాజు, జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు తోర్లపాటి భాగ్యరాజ్, భీమవరం నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు పిట్టా వినోద్‌కుమార్, భీమవరం పట్టణ అధ్యక్షులు చిరా సాయి, ఉండి నియోజకవర్గ అధ్యక్షులు చిగురుపాటి రాజేష్ పాల్గొన్నారు.

ఆసుపత్రికి వైద్య పరికరాలు అందజేత

తణుకు: వేల్పూరు గ్రామంలో ఆరిమిల్లి అలివేలు మంగతాయారు మెమోరియల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వేల్పూరు గ్రామ మాజీ సర్పంచి పెనుమర్తి సోమసూర్యచంద్రరావు కుమార్తె, అల్లుడు దోనేపూడి జయమాధురి, నాగేంద్రబాబు రూ.లక్షా 50 వేల విలువైన పరికరాలు బెడ్స్, 5 పారా వైటల్ మానిటర్లు, సిటిజి మెషీన్లు బుధవారం తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ వేల్పూరు ఆరోగ్య కేంద్రానికి, ప్రజలకు ఉపయోగపడే విధంగా వైద్య పరికరాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి విశ్వనాధం కృష్ణవేణి, గ్రామ ఉప సర్పంచి గుణ్ణం రాజారావు, గ్రామ మాజీ ఉపసర్పంచి రెడ్డి నరేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

టిడిపి యూత్ అధ్యక్షుడు మురళీపై చర్యలు తీసుకోవాలి

నరసాపురం: టిడిపి పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు బర్రె మురళీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్‌కు ఫిర్యాదు చేసినట్లు నర్సాపురం శ్రీహరిపేటకు చెందిన వనమాడి రాంబాబు తెలిపారు. తనకు చేపల బోటు ఉందని, సముద్రంలో వేట నిమిత్తం నర్సాపురం ఏటిగట్టు మీద బోటు కట్టుకుని బంకులో డీజిల్ తెచ్చుకుంటుంటే పొన్నపల్లి ప్రాంతానికి చెందిన బర్రె మురళీ గత కొంతకాలం నుంచి ఇక్కడ ప్రతి బోటు దారుడు తన వద్దే కమిషన్ ఇచ్చి డీజిల్ కొంటున్నారని తెలిపాడని చెప్పారు. అయితే తాను కూడా అతని వద్దే కొనాలని, లేకపోతే బోటు తాళ్లు విప్పేస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడని రాంబాబు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ రకమైన ఇబ్బందులకు గురిచేస్తున్న మురళీపై తగు చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒకు వివరించానని తెలిపారు.

అవినీతిని బయట పెడతాం

మున్సిపాల్టీలో ఎంఎల్ఎ బొలిశెట్టి ఆకస్మిక తనిఖీ

తాడేపల్లిగూడెం: పురపాలక సంఘంలో జరిగిన అవినీతిని బయట పెడతామని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వెళ్లే సమయానికి కొంతమంది అధికారులు, సిబ్బంది విధులకు హాజరు కాకపోవడంపై ఆగ్రహంవ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగా సిబ్బంది అలసత్వం వహించి ప్రజల సమస్యలు పెడ చెవిని పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మున్సిపల్ శాఖా మంత్రి నారాయణతో ఇప్పటికే తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై ఎంక్వయిరీకి కోరామని, తిన్న ప్రతిపైసా కట్టించే వరకూ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు.

యంత్రాల తరలింపును అడ్డుకున్న సిపిఎఫ్ కార్మికులు

గణపవరం: సిపిఎఫ్ ఫ్యాక్టరీకి సంబంధించిన మిషనరీని తరలించడానికి వచ్చిన వారిని ఫ్యాక్టరీ ఉద్యోగ, కార్మికులు అడ్డుకున్నారు. 32 రోజులుగా ఫ్యాక్టరీ వద్ద కార్మికులు నిరసన తెలుపుతున్నారు. ఈ తరుణంలో ఫ్యాక్టరీ యాజమాన్యం బుధవారం ఫ్యాక్టరీలో ఉన్న మిషనరీని వేరేచోటకు తరలించే ప్రయత్నం చేసింది. మిషనరీని తీసుకెళ్లడానికి వచ్చిన వారిని కార్మికులు అడ్డగించారు. దీంతో యాజమాన్యం ఏదో విధంగా మిషనరీని తీసుకెళ్లడానికి స్థానిక పోలీసులకు ఫోన్ చేసి రప్పించారు. తమ సమస్య పరిష్కారం కాకుండా మిషనరీని వేరే చోటికి తరలిస్తే ఊరుకోబోమని కార్మికులు పోలీసులతో ఘర్షణ పడ్డారు. విషయం తెలుసుకున్న సరిపల్లి గ్రామ సర్పంచి చనుమూరి లక్ష్మీభవాని శివ ప్రసాద్ ఫ్యాక్టరీ వద్దకు వచ్చి కార్మికుల సమస్య పరిష్కరించే వరకూ మిషనరీని తొలగించడానికి వీల్లేదని చెప్పడంతో ఫ్యాక్టరీ యాజమాన్యం చెందిన మనుషులు వెనక్కి వెళ్లిపోయారు. దీనిపై వారు మాట్లాడుతూ తమకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు. 32 రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికీ ప్రజా ప్రతినిధులు, అధికారులు, రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి దృష్టికి తీసుకెళ్లకపోవటం దారుణమన్నారు. వెంటనే తమ సమస్యను కార్మిక శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

జెడ్‌పి హైస్కూల్‌ను అభివృద్ధి చేస్తా: ఆర్ఆర్ఆర్

ఉండి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. బుధవారం ఉండి హైస్కూల్‌ను సందర్శించిన ఆయనకు విద్యార్థులు పాఠశాలలోని సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఏలూరి రామలక్ష్మి మాట్లాడుతూ తమ పాఠశాలలో పెంకుటిల్లు పైకప్పు పాడైపోయిందని, పాఠశాలకు 12.50 ఎకరాల స్థలం ఉంటే అందులో చాలావరకు ఆక్రమణకు గురైందని తెలిపారు. సరిహద్దులు నిర్ణయించి ప్రహరీ నిర్మిస్తామని గతంలో జెడ్‌పి ఛైర్మన్ హామీ ఇచ్చినప్పటికీ నెరవేరలేదని అన్నారు. వర్షం వస్తే పాఠశాల క్రీడా ప్రాంగణం బురదమయమవుతుందని, పాఠశాల వెనుక ఉన్న ఆక్వా చెరువుల నీటి వ్యర్థాలు బయటకు విడుదల చేసే సమయంలో అవి పాఠశాలలోకి చేరుతున్నాయని అన్నారు. భోజనశాలకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై ఎంఎల్ఎ స్పందిస్తూ త్వరలోనే సమస్యలన్ని పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జనసేన నేత జుత్తిగ నాగరాజు, కొత్తపల్లి నాగరాజు, టిడిపి నేతలు కరిమెరక నాగరాజు,కాగిత బుజ్జి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేతలు

కోటేశ్వరరావు మరణం తీరనిలోటు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

చిట్టి కోటేశ్వరరావు మరణం చేనేత కార్మిక ఉద్యమానికి తీరని లోటని చేనేత కార్మిక సంఘ రాష్ట్ర కార్యదర్శి పి.బాలకృష్ణ అన్నారు. దగ్గులూరు గ్రామంలో బల్ల వీరభద్రం అధ్యక్షతన చిట్టి కోటేశ్వరరావు సంస్మరణ సభ బుధవారం నిర్వహించారు. తొలుత కోటేశ్వరరావు చిత్రపటానికి బాలకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభలో బాలకృష్ణ మాట్లాడుతూ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఉద్యమాలు నిర్వహించామన్నారు. ఉద్యమాభివృద్ధికై తమలాంటి కార్యకర్తలను తయారు చేశారని, చేనేత రక్షణకు, కార్మికుల ఐక్యతకు ఎనలేని కృషి చేశారని తెలిపారు. 50 సంవత్సరాలకే పెన్షన్ కోసం 15 సంవత్సరాలు పోరాటం చేశారని తెలిపారు. స్కూల్ యూనిఫామ్‌లకు చేనేత వస్త్రాలు వాడాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యమించారని తెలిపారు. జరుగుతున్న పోరాటాలకు కోటేశ్వరరావు స్ఫూర్తి అని కొనియాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ కోటేశ్వరరావు ఊపిరి ఉన్నంత వరకూ నిస్వార్థంగా పని చేశారని తెలిపారు. కోటేశ్వరరావు ప్రజల మనిషి అని, ప్రజా సమస్యలపై పని చేశారని, చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్‌గా ఐక్యతకు కృషి చేశారని తెలిపారు. ఈ సభలో మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు జుత్తుగ నరసింహమూర్తి, గ్రామ ఎంపిటిసి శాగా సత్యనారాయణ, మహిళా సంఘం కార్యదర్శి బాసిన శ్యామల మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్ వందన సమర్పణ చేశారు. కోనేటి బాలరాజు, ఎం.సుబ్బారావు, సిహెచ్.సోమేశ్వరరావు, తిరుమాని శ్రీనివాస్, డి.సుధాకర్, జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

అంటువ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఆకివీడు

వర్షాకాలంలో వచ్చే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ వైద్యాధికారి బి.గోవర్ధని సూచించారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా బుధవారం మండలంలోని సిద్ధాపురం గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గోవర్ధన్ మాట్లాడారు. డెంగీ, మలేరియా, ఫైలేరియా వంటి అంటువ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు అవసరమన్నారు. అతిసార ప్రబలకుండా బడి పిల్లలు, చిన్నపిల్లల తల్లులు ఒఆర్ఎస్ ద్రావణం వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్, వైద్య శాఖ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజాభివృద్ధికి కృషి

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నియోజకవర్గంలో ప్రజలందరికీ పార్టీలకతీతంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు అందిస్తూ, అవినీతిరహిత సమాజాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం రామన్నగూడెంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం గ్రామ పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. అభివృద్ధి పనుల పేరుతో కోట్లాది రూపాయలు దోచుకున్నారని విమర్శించారు. త్వరలోనే వైసిపి నాయకులు దోచుకున్న అవినీతి సొమ్మును బయటకు తీస్తామన్నారు. గత ప్రభుత్వంలోని నాయకులు సిగ్గుపడేలా గ్రామాల్లో స్వరాజ్య పాలన అందిస్తామన్నారు. సంక్షేమ పథకాలు అందించే అధికారులు, నాయకులు ఎవరైనా అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు 'తీసుకుంటామని హెచ్చరించారు. అర్హులందరికీ పథకాలు అందిస్తామన్నారు. కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ తాతాజీ, మాజీ జెడ్‌పి ఛైర్మన్ బాపిరాజు, నేతలు పాల్గొన్నారు.

గుర్రపుడెక్క, కిక్కిస తొలగింపు నిధుల మంజూరు

నేటి నుండి పనులు ప్రారంభం - కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఆయకట్టు పరిధిలోని కాలువల్లో 49 గుర్రపుడెక్క, కిక్కిస తొలగింపు పనులకు రూ.545.79 లక్షలు, డ్రెయిన్లలో 35 పనులకు రూ.592.59 లక్షలు మంజూరైనట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలో 49 గుర్రపుడెక్క, కిక్కిస తొలగింపు పనులకు రూ.545.79 లక్షలు, డీసిల్టింగ్, షట్టర్ల మరమ్మతులు, ఇతర పనుల నిమిత్తం మొత్తం 90 పనులకు రూ.848.91 లక్షలు మంజూరుకు ప్రతిపాదలను పంపినట్లు చెప్పారు. వీటిలో 49 కలుపు తొలగింపు పనులకు రూ.545.79 లక్షలు మంజూరయ్యాయని, వీటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. కొన్ని పనులు ఇప్పటికే ప్రారంభించారని, మిగిలిన పనులు శుక్రవారం నుంచి ప్రారంభిస్తారని చెప్పారు. డ్రెయిన్లలో 35 కలుపు తొలగింపు పనులకు రూ.592.59 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. వీటి పనులు కూడా ప్రారంభించారన్నారు.

బాలలకు పౌష్టికాహారం పంపిణీ

పాలకొల్లు : దాతల దాతృత్వం ద్వారానే సేవా కార్యక్రమాలు సాధ్యమవుతాయని మానవత పాలకొల్లు శాఖ కన్వీనర్ ముత్యాల రామారావు అన్నారు. చిన్నారి దొడ్డిపట్ల జతిన్ పుట్టినరోజును పురస్కరించుకుని తల్లిదండ్రులు వీరభద్రకుమార్, లక్ష్మీపార్వతి ఆర్థిక సహకారంతో జతిన్ తాత సిద్ధాని బాలశంకర మల్లేశ్వరరావు హెచ్ఐవి బాధిత బాలలకు బుధవారం పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యమంలో మాజీ అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, కార్యదర్శి కొమ్ముల మురళీ, ట్రెజరర్ ముత్యాల శ్రీవాత్సవ, సభ్యులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను వినియోగించుకోవాలి

ఉండి: కోళ్ల పెంపకంపై ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎన్.మల్లికార్జునరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో కృషి విజ్ఞాన కేంద్రంలో వివిధ రకాల కోళ్ల పెంపకం, వాటి యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇది ఒక చిన్న తరహా కుటీర పరిశ్రమగా భావించి ఆసక్తి ఉన్న రైతులు, మహిళలు గ్రామీణ యువత కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చట్టాలపై అవగాహనుండాలి

కాళ్ల: సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్యానల్ లాయర్స్ పులిదిండి అంబేద్కర్ అన్నారు. పెదఅమిరంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సదస్సులో ప్యానల్ లాయర్స్ పులిదిండి అంబేద్కర్ మాట్లాడారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం 1994, నార్కిమేల్లి సుధీర్ మహిళా చట్టాలు, సామాజిక న్యాయం గురించి వివరించారు. ఉచిత న్యాయం, లోక్ అదాలత్ అంశాలపై సచివాలయం సిబ్బందికి, బాల బాలికల రక్షణ పథకం, గృహ హింస చట్టం, చట్టాల ప్రాముఖ్యతను గురించి గ్రామస్తులకు వివరించారు. సదస్సులో సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, న్యాయవాదులు ఎన్.సుధీర్, అంబేద్కర్, బి.సునీల్ కుమార్ పాల్గొన్నారు.